సంతోష సమయంలో సీతయ్యకు మందు పార్టీ కూడా ఇప్పించేడు అప్పన్న. తనకతను చేసిన సహాయానికి కృతజ్ఞతగా.ఇప్పుడు ఆకాశంలో అలుముకుంటున్న మేఘాలను చూస్తుంటే మునుపటిలా భయం కలగడంలేదు అప్పన్నకి. కుంభవృష్టి కాదుకదా, దానమ్మ తుపానొచ్చినా మరేం పర్లేదన్న ధీమా వచ్చేసింది. పైగా ఇప్పుడు ప్రతీ రోజూ వర్షం రావాలని కోరుకుంటున్నడు.

ఆ రోజు సాయంకాలం. స్టాండులో రిక్షా పెట్టుకొని కూర్చున్నాడప్పన్న. పడమటి దిక్కునెక్కడో ఉరుము ఉరుమింది. మెరుపు మెరిసింది. కాసేపట్లో కారుమబ్బు లొకటొకటిగా అతుక్కొని ఆకాశాన్ని దట్టంగా కప్పేశాయి. ఇంకాసేపట్లో వర్షం వస్తుందనటానికి సూచనగా చల్లని గాలులు సుతారంగా వీస్తున్నాయి. చుట్ట వెలిగించి కాసేపట్లో రాబోయే వర్షం కోసం ఆతృతగా, ఆశగా ఆకాశంవైపు చూస్తున్నాడు. వర్షం కురుస్తున్నప్పుడు బేరాలు ఎక్కువ తగిలి మరిన్ని ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో కాదు. ఒడుపు తెలియాలేగానీ ఎప్పుడైనా పాసింజర్ల దగ్గర్నుంచి ఎక్కువ డబ్బులు గుంజొచ్చు. అప్పన్నకా ఒడుపు తెలుసు.

కానీ... వర్షం కురుస్తున్నప్పుడు రెండు చుక్క బిగించి ఇంటికెళ్లిపోయి కడుపు నిండా బువ్వలాగించి పెళ్లాన్ని కావలించుకొని పడుకుంటే కలిగే సుఖం గురించి ఆలోచిస్తున్నాడప్పన్న. చల్లని వాతావరణంలో భార్య నులివెచ్చని కౌగిలిలో దొరికే ఆనందాన్ని అనుభవించాలన్న అనుభూతి కోసం వర్షం రావాలని కోరుకుంటున్నాడు. చాలా చిన్న ఆశ. బీదవాడి చిగురాశ.

అయితే అతని ఆశను నిరాశ చేస్తూ అరగంట సమయంలో ఎక్కడి మబ్బులక్కడే చెల్లాచెదురైపోయాయి. అందుకు చాలా బాధపడిపోయాడు అప్పన్న. "సత్...దీనాలి. రమ్మన్నప్పుడు రాదు. వద్దంటే వత్తాది" అని వర్షాన్ని కసిగా తిట్టుకున్నాడు.

ఆ రోజే కాదు. మర్నాడూ, ఆ మర్నాడూ కూడా అలాగే జరిగింది. ఎప్పుడెప్పుడు వర్షం పడుతుందాని అప్పన్న ఆశగా మేఘాలు కమ్ముకుంటున్న ఆకాశంవైపు చూడటం. అతడి ఆశ నిరాశ చేస్తూ ఎక్కడి మబ్బులక్కడే కాసేపట్లో చెల్లాచెదురైపోయి, చింతపండుతో తోమిన రాగిచెంబులా ఆకాశం తళతళా మెరిసిపోవడం షరా మామూలైపోయింది.

"చిచ్చిచ్చీ...ఎదవోన కురా కురదు, సెయ్యా సెయ్యదు" అని ఇప్పుడు ప్రతీరోజూ వర్షం కురవనందుకు తిట్టుకుంటున్నాడు అంతకు కొన్ని రోజుల ముందు వర్షం కురవకూడదని దేవుణ్ని మొక్కుకున్న అప్పన్న.

అతనికేం తెలుసు?అతనిలాంటి మరెంతో మంది అప్పన్నలు...కొత్త తాటాకు నెయ్యించుకునే స్థోమతలేని వారు, వర్షం పడి జలమయమైపోయే తమ పూరిగుడిసెలను తలచుకొని 'వరసం రాకుండా సూడు తండ్రీ' అని దేవుణ్ని మొక్కుకుంటున్నారని?

**-బి.ఎ.రెడ్డి (విశాఖపట్నం)**

# మన వాడే

ఆ రోజు ఆఫీసు నుంచి చాలా ఆలస్యంగా ఇల్లు చేరాను. రాగానే అలసటగా సోఫాలో వాలాను. ఇంతలోనే వచ్చింది మా ఆవిడ.

"మీ ఫ్రెండ్ నాగేశ్వర్రావుకి యాక్సిడెంట్ అయ్యింది. తెలిసిందా?" అనడిగింది.

"ఔనా! దెబ్బలు బాగా తగిలాయా? ఇప్పుడు ఎక్కడున్నాడు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాను.

"మధ్యాహ్నంట. కృష్ణ హాస్పిటల్‌లో ఉన్నాట్ట. ముఖానికి బాగా దెబ్బలు తగిలాయని, వాళ్ల పక్కింటి కుర్రాడు చెప్పాడు" అంది.

"అసలే వీడిది రాష్ డ్రైవింగ్. పైగా బైక్ మీద వెళ్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూంటాడు. ఎన్నోసార్లు చెప్పాను వాడికి వద్దని. వినడు" అన్నాను బాధగా.

"టీ తాగి వెళ్లండి" అంటూ వంటింట్లోకి వెళ్లింది.

నేనీలోగా నాగేశ్వర్రావింటికి ఫోన్ చేసి మాట్లాడాను. ప్రాణభయం లేదన్నారని చెప్పారు ఇంట్లో ఉన్నవాళ్లు.టీ తాగి హాస్పిటల్‌కి బయల్దేరాను.

హాస్పిటల్‌లో నాగేశ్వర్రావు రూం ముందు జనం బాగా ఉన్నారు. నాగేశ్వర్రావు పైరవీకారుడు. అన్ని రంగాల్లో పరిచయస్తులున్నారంటాడు. అవసరమై వచ్చిన వాళ్లకి తెలిసిన వాళ్ల ద్వారా పనులు చేసిపెడుతూ డబ్బు, పేరు బాగానే గడించాడు. కాబట్టి అతని కోసం అంతమంది జనం రావటంలో ఆశ్చర్యం లేదు. 'అతనికి దగ్గర మంచి మార్కులు కొట్టేయటానికి ఇది తగిన సమయం వాళ్లకి' అనుకుని నవ్వుకున్నాను.

నాగేశ్వర్రావు నాకు మంచి ఫ్రెండ్. ఈమధ్య అతని పైరవీ వ్యవహారాలు నాకు నచ్చకపోయినా స్నేహం మాత్రం కొనసాగుతూనే ఉంది. పనైపోతుందని అమాయకులకి ఆశపెట్టి డబ్బు తీసుకుని ఇంటికి తిప్పుకోవటం పద్ధతి కాదని చాలాసార్లు చెప్పుంటాను. "పనికాకపోతే డబ్బు వెనక్కి ఇచ్చేస్తాను కదా" అంటాడు.

కానీ ఎప్పుడు? వాటిని వడ్డీలకిచ్చి, అవి వసూలైనప్పుడు ఇస్తాడు. "నేను సిన్సియర్‌గానే ట్రై చేస్తాను. ఒక్కోసారి మనవాళ్లు పనులు చెయ్యరు. దానికి నేనేం చేస్తాను తీసుకున్న డబ్బు వెనక్కి ఇవ్వటం తప్ప." అంటాడు లౌక్యంగా.

వచ్చిన వాళ్లంతా ఫార్మాలిటీగా కలిసి పలకరించి వెళ్తున్నారు. రష్ తగ్గే దాకా వేచి చూద్దామని ఓ పక్కగా నిలబడ్డాను. ఓ పావుగంటకి జనం పల్చబడ్డారు. అప్పుడు నేను లోపలికెళ్లాను. అతని భార్య, పిల్లలు తప్ప ఎవ్వరూ లేరు లోపల.

తలకి కట్టు కట్టి ఉంది. ఒక కంటిని పూర్తిగా మూసేస్తూ బాండేజ్ వేశారు. ఒంటి మీద అక్కడక్కడా చిన్న చిన్న గాయాలున్నాయి.

"ఇప్పుడెలా ఉంది" అడిగాను మృదువుగా. అతని చేతి మీద చేయి వేసి పక్కనున్న స్టూలుమీద కూర్చుంటూ.

జవాబుగా కంట్లోంచి నీళ్లు కారాయి అతనికి.

"ఏంటిది చిన్నపిల్లాడిలాగా? ధైర్యంగా ఉండాలి. ఐనా ఇప్పుడేమైంది. ప్రమాదం లేదన్నారుగా డాక్టర్" అన్నాను ఓదార్పుగా.

"అసలు ప్రాణాలు ఉంటాయా పోతాయా అని చచ్చే భయంవేసిందనుకో" అన్నాడు బొంగురుపోయిన గొంతుతో.

"సెల్ మాట్లాడుతూ డ్రైవ్ చేశావా? అసలు యాక్సిడెంట్ ఎలా జరిగింది?" అడిగాను.

"అర్జెంట్ పనిమీద వెళ్తూ పోస్టాఫీస్ సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసు మనవాడే కదాని చెయ్యూపేసి రాంగ్ రూట్‌లో వెళ్లబోయాను. స్పీడ్‌గా వస్తున్న లారీని గుద్దేశాను" చెప్పాడు. పైరవీలు చేసీ చేసీ వచ్చిన వాళ్లందరి దగ్గరా తనకు తెలిసిన వాడికి మనవాడే పనైపోతుంది అనటం అలవాటు నాగేశ్వర్రావుకి.

"అసలీ హాస్పిటల్లో ఎందుకు చేరావు? ఈమధ్య చాలా కేసులు ఫేలయినట్టు వింటున్నాను" అన్నాను.

"ఔనా? మన పరమశివం లేడూ, వాడు యాక్సిడెంట్ కాగానే నన్ను చూసి మనవాడే అంటూ ఈ హాస్పిటల్‌లో చేర్చాడు" అంటూ బలహీనంగా నవ్వాడు.

"సరేలే అయ్యిందేదో అయ్యింది. కంటికి కూడా దెబ్బ బాగానే తగిలినట్టుంది. మంచి ఏ స్పెషలిస్ట్ దగ్గరికి వెళ్లాలి. ఇక్కడేమీ సరైన డాక్టర్ లేడు. అసలే సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నారు" అన్నాను.

"ఈ డాక్టర్ ఓ కంటి డాక్టర్‌ని పిలిపించాడు. అతనే ఈ కట్టు కట్టాడు. ఆపరేషన్ అవసరం కావచ్చు నన్నాడు" నసిగాడు నాగేశ్వర్రావు.

"ఐతే తొందరగా సరైన ట్రీట్‌మెంట్ తీసుకోవాలి..." ఇంకా ఏదో చెప్పబోతుంటే పరమశివం డాక్టర్‌తో కలిసి వచ్చాడు. నేను పక్కకి జరిగి నిలబడ్డాను.

"మీ కంటికి అర్జెంట్‌గా ఆపరేషన్ చేయాలంటున్నాడు డా.మురళి" అన్నాడు డాక్టర్. నాగేశ్వర్రావు బేలగా చూశాడు నా వైపు.

"కానీ అంత అర్జెంటుగా..." ఇంకా ఏదో అనబోయాడు నాగేశ్వర్రావు.

అతని సంశయాన్ని గ్రహించినట్టు అన్నాడు డాక్టర్. "మురళి ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేస్తున్నాడు. మీరేం భయపడకండి అతను మంచి ఎక్స్‌పర్ట్, పైగా మనవాడే" డాక్టర్ చెబుతూండగానే కెవ్వుమని కేకేస్తూ స్పృహ తప్పాడు నాగేశ్వర్రావు.

**-బి.వి.శేషమాంబ (కొత్తగూడెం)**